# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశానికి ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా పేరుగాంచిందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టిన డిఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఈ రోజు ప్రభుత్వం అందజేయనుంది.**

3. **ఆంధ్రప్రదేశ్ లోని ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు.**

4. **తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.**

5. **దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శ్రీ కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**

==========================

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విజయవాడలోని పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'లో గత సాయంత్రం కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి అయ్యాక తొలిసారి విజయవాడ పర్యటనకు రావడం సంతోషంగా ఉందన్నారు. దేశానికి ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా పేరుగాంచిందని తెలిపారు. విజయవాడ దేశంలోనే గొప్ప నగరంగా మారుతుందని, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

అలాగే కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ విజయవాడకు గుర్తింపుగా విజయవాడ ఉత్సవ్ నిలుస్తుందని తెలిపారు. పరిశుభ్రత, ఆధ్యాత్మిక విషయంలో విజయవాడ ముందుందని చెప్పారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ కోసం చేపట్టిన డిఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఈరోజు అందజేయనున్నారు. అమరావతి సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రాంగణంలో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్, రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌లు ఈ నియామక పత్రాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది.. మొత్తం 16 వేల 347 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఎంపికైన 15 వేల 941 మందికి ఈరోజు నియామక పత్రాలు అందజేయనున్నారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణాన్ని నిర్వహించారు. గత సాయంత్రం మీనలగ్నంలో దేవతలను ఆహ్వానిస్తూ నిర్వహించిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామివారికి పెద్దశేష వాహన సేవను నిర్వహించారు. ఈ ఉదయం చిన్న శేష వాహన సేవ జరుగనుంది.

ఇదిలా వుండగా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

కాగా ఈరోజు ఉదయం తిరుమలలోని వెంకటాద్రి నిలయం ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా ఉప్పాడలో మత్స్యకారుల ఆందోళనపై పవన్‌కల్యాణ్ స్పందించారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలపై మత్స్యకారులు చేపట్టిన ఆందోళన, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారంతోపాటు జీవనోపాధి మెరుగుదల, తీర ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపైనా ఈ కమిటీ దృష్టి సారిస్తుందని చెప్పారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. వ్యవసాయంలో సాంకేతికత అమలు గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 : 31 )

---------------------------

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శ్రీ కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీశైలక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల మూడో రోజైన నిన్న శ్రీభ్రమరాంబాదేవి చంద్రఘంట అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రావణ

వాహనంపై కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. పురవీధుల్లో శ్రీస్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

మరోవైపు తెలంగాణలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఈరోజు అట్ల బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఆరెంపులలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం సభలో మంత్రి మాట్లాడుతూ.. పేదలకు సొంత ఇంటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మరో మూడు విడతల్లో ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయనున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆసియా కప్ సూపర్ ఫోర్లో భాగంగా దుబాయ్ వేదికగా భారత్, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన టీ–20 క్రికెట్ మ్యాచ్‌లో 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై భారత్ విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆల్ అవుట్ అవ్వడంతో 41 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది. దీంతో ఆసియా కప్ ఫైనల్‌కు భారత్ చేరుకుంది.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ దిశగా కదులుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్.. 23 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడురోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================